## ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి


ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కిషన్‌రెడ్డి

శాలిగౌరారం, డిసెంబర్ 2 : ప్రతి ఒక్కరూ దైవ భక్తి అలవర్చుకుని ఆధ్యాత్మిక చింతనను కలిగి ఉండాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి అన్నారు. శాలిగౌరారం (తిరుమలరాయినిగూడెం)లోని సీతారామచంద్ర స్వామి దేవాలయం ఆవరణలో అభయాంజనేయ స్వామి విగ్రహం ప్రతిష్ఠించి 40 రోజులు పూర్తైన సందర్భంగా శనివారం నిర్వహించిన మండల పూజా కార్యక్రమానికి కిషన్‌రెడ్డి, ఇందిరా దంపతులు హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయం అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో రామగిరి వాస్తవ్యులు చామల సృజనారెడ్డి, చాడ చరిత్‌రెడ్డి, వాడపల్లి జగన్, కూరం వెంకన్న, చిలుకూరి ప్రవీణ్ పాల్గొన్నారు.

## చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలి

- మహిళా వైద్య నిపుణుల సంఘం జిల్లా కార్యదర్శి మంజుల


నకిరేకల్ పట్టణంలో అవగాహన ప్రదర్శన నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నకిరేకల్, డిసెంబర్ 2 : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, షీ టీమ్స్, సఖీ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మహిళా వైద్య నిపుణుల సంఘం జిల్లా కార్యదర్శి రాపోలు మంజుల అన్నారు. నకిరేకల్ పట్టణంలో మహిళలపై హింస–నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా మహిళా వైద్య నిపుణుల సంఘం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నవంబర్ 25 నుంచి డిసెంబర్ 5 వరకూ అవగాహనా ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హింసను అరికట్టేందుకు మహిళలంతా ఒక్కటవ్వాలని, చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు సోమ సుశ్రుత, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శాలిగౌరారం, డిసెంబర్ 2 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. శాలిగౌరారం ఎస్ఐ సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చిత్తలూర్ గ్రామానికి చెందిన బాలెం వెంకన్న (45) శనివారం బైక్‌పై నకిరేకల్ పట్టణంలోని బంధువుల వివాహానికి హాజరయ్యాడు. తన బిడ్డ కూతురు(మనవరాలు)ను తీసుకుని స్వగ్రామం బయల్దేరాడు. మార్గమధ్యలో పెర్కకొండారం గ్రామ శివారుకు చేరుకోగానే వెనక నుంచి అతివేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో వెంకన్న అక్కడికక్కడే మృతిచెందాడు. మనవరాలు గాయాలతో బయటపడినట్లు తెలిపాడు. మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ దవాఖానకు తరలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు వెల్లడించారు.


కళా ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

## 16 నుంచి ఏపీలో ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలు

- మనమ్ వికాస్ వేదిక అధ్యక్షుడు గణేశ్

బొడ్రాయిబజార్, డిసెంబర్ 2 : కళా వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 16, 17 తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో గల బుద్ధాల కన్వెన్షన్‌లో నిర్వహించే ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలను విజయవంతం చేయాలని మనమ్ వికాస్ వేదిక అధ్యక్షుడు పెద్దిరెడ్డి గణేశ్ కోరారు. శనివారం స్థానిక సుధా బ్యాంక్ ఆడిటోరియంలో కళా ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కళాకారులను ప్రోత్సహించేందుకు కళా వేదిక ఆధ్వర్యంలో 30గంటల 30నిమిషాల 30సెకన్ల పాటు నాన్‌స్టాప్ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, అంతర్జాతీయ చైర్మన్ కత్తిముండ ప్రతాప్ నిర్వహించే వివిధ రకాల కళా ప్రదర్శనలను కళాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళావేదిక అధ్యక్షుడు పోతుగంటి వీరాచారి, కవి హమీద్‌ఖాన్, కార్టూనిస్టులు పల్లె మణిబాబు, శిరంశెట్టి ఆనంద్, ధైద వెంకన్న, ఉపేంద్రచారి పాల్గొన్నారు.

# ఓటేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



నకిరేకల్, డిసెంబర్ 2 : తన గెలుపును కోరుతూ ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. శనివారం నమస్తే తెలంగాణతో మాట్లాడుతూ.. తనను గెలిపించేందుకు సైనికుల్లా శ్రమించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజక వర్గ వ్యాప్తంగా 86.67 శాతం పోలింగ్ నమోదైనట్లు ఆయన చెప్పారు. మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నట్లు వెల్లడించారు. ఒకవైపు పోలింగ్ కొనసాగుతున్నప్పటికీ సాయంత్రం ఐదున్నర గంటలకే కొన్ని సర్వే సంస్థలు ఎగ్జిట్ పోల్స్‌ను విడుదల చేయడం ద్వారా ఓటర్లు అయోమయానికి గురయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయాన్ని తమ పార్టీ పెద్దలు ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు. ఎవరెన్ని తప్పుడు ప్రచారాలు చేసినా ఓటర్లు తనపై నమ్మకంతో ఓటేసినట్లు వివరించారు. బోగస్ ప్రచారాలను నమ్మి అభిమానులు, కార్యకర్తలు మనోధైర్యం కోల్పోవద్దని సూచించారు. నియోజక వర్గ వ్యాప్తంగా జరిపిన సర్వేలో నూటికి నూరుశాతం నకిరేకల్‌లో బీఆర్ఎస్ గెలుపొందుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో విధులు నిర్వహించిన అధికారులు, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు కృషి చేసిన పోలీసులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

## సర్వత్రా ఉత్కంఠ రేపుతున్న నకిరేకల్ ఫలితం

- మొదటగా రామన్నపేట.. చివరిగా కేతేపల్లి మండల ఓట్ల లెక్కింపు

కట్టంగూర్, డిసెంబర్ 2 : నియోజక వర్గంలో పోటీ చేసిన అభ్యర్థుల భవితవ్యం నేటి ఎన్నికల కౌంటింగ్‌తో తేలనున్నది. ఆదివారం మధ్యాహ్నం వరకు అభ్యర్థుల గెలుపోటములు ఖరారు కానున్నాయి. నకిరేకల్ నియోజక వర్గంలో ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. నియోజక వర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎం, బీఎస్పీ అభ్యర్థులతో పాటు మరో 20 మంది స్వతంత్ర అభ్యర్థులకు కలుపుకుని మొత్తం 23 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. అయినప్పటికీ ప్రధానంగా బీఆర్ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య, కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం మధ్యే పోటీ నెలకొన్నది. నకిరేకల్ నియోజక వర్గంలో మొత్తం 305 పోలింగ్ కేంద్రాల్లో 2,50,547 మంది ఓటర్లకు గానూ 2,17,149 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో 1,09,585 మంది పురుషులు, 1,07,562 మంది స్త్రీలు ఉన్నారు. 86.67 శాతం పోలింగ్ నమోదయ్యింది. నియోజక వర్గంలో అత్యధికంగా కట్టంగూర్ మండలంలో 88.52 శాతం పోలింగ్ నమోదు కాగా అత్యల్పంగా నకిరేకల్ మండలంలో 85.44 శాతం నమోదైంది. కౌంటింగ్‌లో భాగంగా మొదటగా రామన్నపేట మండలంలో 1 నుంచి 59వ పోలింగ్ కేంద్రాల్లో కౌంటింగ్ ప్రారంభమవుతుంది. అనంతరం చిట్యాల మండలంలో 60–111 వరకు, నార్కట్‌పల్లి మండలంలో 112 నుంచి 170 వరకు, కట్టంగూర్ మండలంలో 170 నుంచి 209 వరకు, నకిరేకల్ మండలంలో 210 నుంచి 270 వరకు, చివరిగా కేతేపల్లి మండలంలో 271 నుంచి 305 వరకు ఓట్లను లెక్కించనున్నారు.

# ఎక్కడ చూసినా కౌంటింగ్‌పైనే చర్చ


నకిరేకల్ మండలం మోదినిగూడెంలో అరుగుపై కూర్చుని ఎన్నికల ఫలితాలపై చర్చిస్తున్న గ్రామస్తులు

నకిరేకల్, డిసెంబర్ 2 : ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఎవరికెన్ని ఓట్లు పడతాయనే అంశంపై ఆయా గ్రామాలు, మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో ఆయా ప్రాంత నేతలు జోరుగా చర్చించుకుంటున్నారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో 61 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య పోటాపోటీ నెలకొనడంతో ఆయా పార్టీల నాయకులు ఎవరికి ఎన్ని ఓట్లు వస్తాయనే అంచనా వేస్తున్నారు. గ్రామాలను, పట్టణాన్ని పరిగణలోకి తీసుకుని ఓటరు జాబితాను దగ్గర పెట్టుకునిమరీ ఎవరు ఏ పార్టీకి ఓటు వేసుంటారో ఊహిస్తున్నారు. ఇలా బీఆర్ఎస్‌కు, కాంగ్రెస్‌కు గ్రామాల వారీగా, వార్డుల వారీగా పడిన ఓట్లను లెక్కించుకుంటున్నారు. ఎవరికి వారే తమకు గ్రామాల్లో, వార్డుల్లో మెజార్టీ వస్తుందని అంచనాలు వేస్తున్నారు. గత ఎన్నికల్లో వచ్చిన ఓట్లు ఈసారి వచ్చే ఓట్లపై లెక్కలు వేస్తున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఏ పార్టీకి ఎన్ని పడుంటాయో విభజిస్తున్నారు. దీనిని బట్టి మండలంలో, మున్సిపాలిటీలో ఏ పార్టీకి ఎంత మెజార్టీ వస్తుందో కూడా అంచనా వేస్తుకుంటున్నారు. నకిరేకల్ మండల వ్యాప్తంగా 49,812 ఓటర్లు ఉండగా 42,558 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 85.44 శాతం పోలింగ్ నమోదైంది. ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసుకుని మండలంలో, పట్టణంలో అంత, ఇంత మెజార్టీ వస్తుందని లెక్కలు వేసుకుంటున్నారు. వేసుకున్న అంచనాలను ఓట్ల లెక్కింపు రోజున వచ్చే ఫలితాలు తమ అంచనాకు అందుతాయో లేదో కూడా చూసుకోవాలనుకుంటున్నారు. ఎక్కడైనా తప్పిదాలు జరిగాయా? ఉన్న వైఫల్యాలు ఏంటనే అంశాలపై ప్రశ్నలు వేసుకుంటున్నారు. మొత్తంగా నేటి ఓట్ల లెక్కింపుతో ఎవరి సత్తా ఏమిటో, ఎవరి అంచనాలు సరిపోలుతాయో నాయకులకు అంతు చిక్కనున్నది.

### ఓట్ల లెక్కల్లో బిజీ బిజీగా

మునుగోడు : మండలంలోని ఆయా గ్రామాల్లో తమ పార్టీలకు ఎన్ని ఓట్లు పడ్డాయనే లెక్కల్లో నాయకులు తలమునకలయ్యారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో ఏ ఊర్లో ఎన్ని ఓట్లు వచ్చాయి. ఎన్ని మిస్ అయ్యాయి. ఏయే బూత్‌లలో ఓట్లు వేయని వారెవరు? అనే కోణంలో రాజకీయ పార్టీలకు చెందిన మండల నాయకులు ఆయా గ్రామాల్లోకి వెళ్లి తమ పార్టీ నాయకులతో చర్చిస్తున్నారు.


నకిరేకల్ మండలం నడిగూడెం గ్రామంలో ఫలితాలపై చర్చిస్తున్న గ్రామస్తులు

### ఎక్కడ గుమికూడినా ఫలితాలపై చర్చే

చౌటుప్పల్ : ఎక్కడ నలుగురు గుమికూడినా, ఏ హోటల్‌లో కలిసినా, ఏ టీ పాయింట్ వద్ద చేరినా మునుగోడు ఫలితాలపైనే చర్చిస్తున్నారు. పలు అంచనాల ఆధారంగా ఎవరు గెలుస్తారనే దానిపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. పలు చోట్ల బెట్టింగులు సైతం నడుస్తున్నట్లు సమాచారం. జోరుగా సాగుతున్న చర్చలు, విశ్లేషణలకు నేటి ఫలితాల వెల్లడితో తెరపడనున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం మునుగోడు ఉప ఎన్నికల్లో రూ.574 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు కేటాయించింది. వాటిలో పలు పనులు పూర్తికాగా, మరికొన్ని కొనసాగుతున్నాయి. దాంతో తమకు కలిసొచ్చే అవకాశాలు ఉన్నట్లు పార్టీ శ్రేణులు బలంగా నమ్ముతున్నాయి. కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా ఫలితాలు తమకే అనుకూలమని భావిస్తున్నారు. బూత్‌ల వారీగా కూడా స్థానిక నేతలు ఎవరికివారే లెక్కలు వేస్తున్నారు. నియోజకవర్గంలో 307 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొదటి కేంద్రం చౌటుప్పల్ మండలంలోని జైకేసారం. ఈ గ్రామంలో 3 బూత్‌లు ఉన్నాయి. మొదటి రౌండ్‌లో 14 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలను లెక్కించనున్నారు.